నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
3 | ఖమ్మం, బుధవారం 5 జూన్ 2024 | BHADRADRI KOTHAGUDEM

విత్తన బిల్లులు విధిగా ఇవ్వాలి

జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల

ఖమ్మం వ్యవసాయం, జూన్ 4 : రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు వ్యాపారులు విధిగా బిల్లులు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.విజయనిర్మల ఆదేశించారు. ఖమ్మం నగరంలోని త్రీటౌన్ ప్రాంతంలో ఉన్న పలు విత్తన దుకాణాలు, గోదాములను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. గోడౌన్‌లో స్టాక్‌ను, రికార్డులను పరిశీలించారు. విత్తనాలు కొనుగోలు చేసేందుకు దుకాణాలకు వచ్చిన రైతులతో ఆమె మాట్లాడారు. రోజువారీ క్రయవిక్రయాలకు సంబంధించిన వివరాలు నమోదు చేయని కృషి ఆగ్రో రైతుసేవా ఏజెన్సీకి నోటీసులు జారీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రోజువారీ క్రయవిక్రయాలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేయాలని, లేదంటే షాపు యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలు, ఎరువుల దుకాణాలకు వచ్చే రైతులకు నాణ్యమైన విత్తనాలను అందజేయాలని, నకిలీ విత్తనాలు అంటగడితే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు. నిబంధనలకు అనుగుణంగా క్రయవిక్రయాలు జరగాలన్నారు. కార్యక్రమంలో అర్బన్ వ్యవసాయ శాఖ అధికారి కిశోర్‌బాబు, జిల్లా వ్యవసాయ శాఖ ఏవో, టెక్నికల్ అధికారి చాయారాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంలో కాంగ్రెస్ విజయం

- అత్యధిక మెజారిటీతో 'రఘురాంరెడ్డి' గెలుపు
- ధ్రువపత్రం అందజేసిన ఖమ్మం కలెక్టర్ గౌతమ్
- పకడ్బందీగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ

రఘురాంరెడ్డికి విజేత ధ్రువపత్రం అందజేస్తున్న ఆర్‌వో, కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం, జూన్ 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఖమ్మం లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. ఆ పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి 4,67,847 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఖమ్మం లోక్‌సభ స్థానానికి మే 13న ఎన్నికలు జరిగిన విషయం విదితమే. ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్లు శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఓట్ల లెక్కింపు జరిగింది. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియతో ప్రారంభమైన కౌంటింగ్.. సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని 7 శాసనసభ నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు ప్రతి రౌండ్‌లోనూ హోరాహోరీగా పోటీ ఇచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డికి ఆయా నియోజకవర్గాల్లో ఆధిక్యం లభించింది. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్లను అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్ల సమక్షంలో ఓపెన్ చేసి లెక్కించారు. పోస్టల్ బ్యాలెట్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావుకు 1,490 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డికి 7,326 ఓట్లు, బీజేపీ అభ్యర్థి వినోద్‌రావుకు 1,561 ఓట్లు లభించాయి. కొందరు స్వతంత్ర అభ్యర్థులకు కూడా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లభించాయి.

పోలైన ఓట్లు..
కాంగ్రెస్: 7,66,929
బీఆర్ఎస్: 2,99,082
బీజేపీ: 1,18,636
మెజార్టీ: 4,67,847

నోటాకు 6,657 ఓట్లు..

ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలతో మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. లెక్కింపు పూర్తయ్యాక కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డికి 7,66,929 ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావుకు 2,99,082 ఓట్లు, బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావుకు 1,18,636 ఓట్లు లభించాయి. ఈ మూడు పార్టీల ప్రధాన అభ్యర్థుల తరువాత అత్యధికంగా నోటాకు 6,657 ఓట్లు పడ్డాయి.

ఆర్‌వో పర్యవేక్షణ..

ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఆసాంతం రిటర్నింగ్ అధికారి, ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ పర్యవేక్షించారు. సీపీ సునీల్‌దత్ భద్రతా చర్యలను పర్యవేక్షించారు. బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు ఉదయం ఓట్ల లెక్కింపు కేంద్రానికి వచ్చి ప్రక్రియను పరిశీలించారు. అనంతరం కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి కౌంటింగ్ కేంద్రానికి చేరుకొని లెక్కింపు ప్రక్రియను పరిశీలించారు. కౌంటింగ్ ముగిసిన అనంతరం విజయం సాధించిన రఘురాంరెడ్డికి ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి హోదాలో గెలుపు ధ్రువపత్రం అందజేశారు. అనంతరం తన విజయానికి కృషి చేసిన ఆ పార్టీ శ్రేణులకు, తనకు అపూర్వ విజయాన్ని అందించిన ఓటర్లకు, సహకరించిన మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలకు ధన్యవాదాలు తెలిపారు. తనకు, తన

పార్టీకి ఇంతటి విజయాన్ని అందించిన నియోజకవర్గ ప్రజలకు మెరుగైన పాలన అందిస్తానని అన్నారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఈ విజయంతో తమ బాధ్యత మరింత పెరిగిందని, నియోజకవర్గ ప్రజలు ఎంపీగా గెలిపించిన రఘురాంరెడ్డి.. ఇక్కడి ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుంటారని అన్నారు.

ఒక్కో టేబుల్‌కు ముగ్గురు అధికారులు..

ఓట్ల లెక్కింపు కేంద్రంలో రిటర్నింగ్ అధికారి వీపీ గౌతమ్, ముగ్గురు అదనపు రిటర్నింగ్ అధికారులతో పాటు ఒక్కో టేబుల్‌కు ముగ్గురు చొప్పున అధికారులను నియమించారు. ఖమ్మం శాసనసభ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు కోసం 18 టేబుళ్లను, మిగిలిన ఆరు శాసనసభ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. మొత్తం 1,896 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఈవీఎంలలోని ఓట్లను 115 టేబుళ్ల ద్వారా లెక్కించారు. తొలుత ఖమ్మం నియోజకవర్గంలోని రఘునాథపాలెం మండలం పాపటపల్లి గ్రామ ఓట్లతో మొదలైన ఓట్ల లెక్కింపు ప్రక్రియ అశ్వారావుపేట నియోజకవర్గంలోని అశ్వారావుపేట మండలం కావడిగూడ గ్రామ ఓట్ల లెక్కింపుతో ముగిసింది.

రఘురాంరెడ్డికి ధ్రువపత్రం అందజేసిన ఆర్‌వో

ఖమ్మం రూరల్, జూన్ 4: లోక్‌సభ సాధారణ ఎన్నికల్లో ఖమ్మం స్థానం నుంచి విజయం సాధించిన రామసహాయం రఘురాంరెడ్డికి ఎంపీగా గెలుపొందిన ధ్రువపత్రాన్ని రిటర్నింగ్ అధికారి, ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ అందజేశారు. ఖమ్మం రూరల్ మండలం శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో ఫలితాల లెక్కింపు అనంతరం విజేతగా నిలిచిన రఘురాంరెడ్డికి మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సత్తుపల్లి, వైరా, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు మట్టా రాఘమయి, మాలోత్ రాందాస్‌నాయక్, జారె ఆదినారాయణ, ఎన్నికల పరిశీలకులు డాక్టర సంజయ్ జీ కోల్టే, ప్రేదిమాన్ కృష్ణన్ భట్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, ట్రైనీ కలెక్టర్ మిర్నల్ శ్రేష్టా, ఇతర అధికారులు ఎం.రాజేశ్వరి పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి ఇలాఖాలో బీజేపీ ఆధిక్యం

పెనుబల్లి, జూన్ 4 : ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మంగళవారం జరిగిన లెక్కింపులో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్వగ్రామమైన సత్తుపల్లి నియోజకవర్గం కల్లూరు మండలం నారాయణపురంలో బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు.. కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిపై 174 ఓట్లు ఆధిక్యం సాధించారు. గ్రామంలోని 94వ బూత్‌లో బీజేపీ అభ్యర్థి వినోద్‌రావుకు 404 ఓట్లు రాగా.. కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డికి 315 ఓట్లు వచ్చాయి. 95వ బూత్‌లో బీజేపీ అభ్యర్థి వినోద్‌రావుకు 197 ఓట్లు రాగా.. కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డికి 112 ఓట్లు వచ్చాయి. మొత్తం బీజేపీ అభ్యర్థికి 174 ఓట్ల ఆధిక్యం వచ్చింది. అయితే, బీజేపీ జాతీయ నాయకుడైన పొంగులేటి సుధాకర్‌రెడ్డి స్వగ్రామం కూడా ఇదే కావడం, మంత్రి పొంగులేటికి కూడా సుధాకర్‌రెడ్డి బంధువు కావడం గమనార్హం. దీంతో సుధాకర్‌రెడ్డి కూడా ప్రతిష్ఠాత్మకంగా భావించడంతో అతడి స్వగ్రామంలో బీజేపీ ఆధిక్యం లభించింది. అయితే, సాక్షాత్తూ మంత్రి పొంగులేటి స్వగ్రామంలోనే బీజేపీకి ఆధిక్యం రావడంపై ప్రజలు చర్చించుకుంటున్నారు.

గెలుపోటములు సహజం

- గెలిచినా ఓడినా ప్రజల మధ్యే ఉంటా..
- కన్న తల్లి ఎంతిష్టమో 'ఖమ్మం' ప్రజలన్నా అంతే ఇష్టం
- బీఆర్ఎస్ శ్రేణులు, ఓటర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు
- గెలిచిన రఘురాంరెడ్డికి అభినందనలు
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు

నామా నాగేశ్వరరావు

ఖమ్మం, జూన్ 4: ఎన్నికల్లో గెలుపోటములు సహజమని బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. గెలిచినా, ఓడినా తాను నిత్యం నియోజకవర్గ ప్రజల్లోనే ఉంటానని అన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. తనకు తన కన్నతల్లి అంటే ఎంత ఇష్టమో.. నియోజకవర్గ ప్రజలు అన్నా అంతే ఇష్టమని అన్నారు. గెలిస్తే పొంగిపోయేది లేదని, ఓడితే కుంగిపోయేది లేదని అన్నారు. ఇకపై కూడా తాను నిత్యం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని, వారి తరపున ప్రశ్నించే గొంతుకగా పనిచేస్తానని అన్నారు. వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడుతానని అన్నారు. ఎంపీగా ప్రజా సేవే లక్ష్యంగా పనిచేశానని, అవినీతికి ఆస్కారం, మచ్చలేకుండా సేవలందించానని గుర్తుచేశారు. తనకు అన్ని విధాలా అండగా ఉండి ముందుకు నడిపించిన పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, శ్రేయోభిలాషులకు, తనకు ఓటేసిన ఓటర్లకు కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని పేర్కొన్నారు. తన బలం, బలగం, ధైర్యం అన్నీ ప్రజలేనని స్పష్టం చేశారు. అదే లక్ష్యంతో ఇకముందు కూడా వారికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని అన్నారు. వారి క్షేమం కోసం శ్రమిస్తానని అన్నారు. తాను ఇక్కడే పుట్టి ఇక్కడే పెరిగానని, ఇక్కడున్న తన ప్రజల మధ్యనే ఉంటానని వివరించారు. ప్రజలకు ఏ కష్టమొచ్చినా నేరుగా తనకు చెప్పుకోవచ్చునని, ఇందుకోసం తన ఇంటి తలుపులు ఎల్లవేళలా తెరిచే ఉంటాయని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎంతో అభివృద్ధి జరిగిందని, గడపగడపకు సంక్షేమ పథకాలు అందాయని అన్నారు. ఖమ్మం స్థానం నుంచి గెలిచిన రఘురాంరెడ్డికి అభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

మానుకోట ఎంపీగా బలరాంనాయక్ గెలుపు

3,46,089 ఓట్ల మెజార్టీ

ఆర్వో అద్వైత్‌కుమార్ సింగ్ నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న బలరాంనాయక్

మహబూబాబాద్, జూన్ 4 (నమస్తే తెలంగాణ): మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా పోరిక బలరాంనాయక్ భారీ మెజార్టీతో గెలిపొందారు. కౌంటింగ్ ప్రారంభం నుంచి తుది రౌండ్ వరకు బలరాంనాయక్ లీడ్ కొనసాగింది. తన సమీప సిట్టింగ్ ఎంపీ, బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవితపై 3,46,089 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో కౌంటింగ్ ప్రక్రియను నిర్వహించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభం కాగా.. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించారు. అనంతరం ఈవీఎం ఓట్ల లెక్కింపు ప్రారంభించారు. ప్రతి రౌండ్‌లోనూ కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్ ఆధిక్యత కనబర్చారు. 2009లో మానుకోట పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి మొదటిసారి ఎంపీగా గెలుపొందారు. అనంతరం ఆనాటి యూపీఏ ప్రభుత్వ హయాంలో కేంద్ర సహాయ మంత్రిగా కూడా పనిచేశారు. 2014లో తిరిగి కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చవిచూశారు. అనంతరం 2018లో నిర్వహించిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబాబాద్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. 2019లో తిరిగి మానుకోట పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మానుకోట నుంచి పోటీ చేయాలని తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ టికెట్ దక్కలేదు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో తిరిగి కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ పొంది భారీ మెజార్టీతో గెలుపొందారు. కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్‌కు 6,12,774 ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవితకు 2,63,609 ఓట్లు, బీజేపీ అభ్యర్థి సీతారాంనాయక్‌కు 1,10,444 ఓట్లు వచ్చాయి. బలరాంనాయక్‌కు కలెక్టర్, ఆర్వో అద్వైత్ కుమార్ సింగ్ ధ్రువీకరణ పత్రం అందజేశారు.

మహబూబాబాద్ లోక్‌సభ ఫలితాలు

పార్టీ	2014	2019	2024
బీఆర్ఎస్	3,19,388	4,62,109	2,63,322
కాంగ్రెస్	2,83,735	3,15,446	6,12,350
బీజేపీ	2,15,664	25,487	1,19,341

(2014లో బీజేపీ పొత్తుతో టీడీపీ పోటీ చేసింది)

మానుకోట లోక్‌సభ నియోజకవర్గం
అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా పార్టీలకు పోలైన ఓట్లు

అసెంబ్లీ	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్ఎస్
మహబూబాబాద్	1,02,011	17,684	52,128
డోర్నకల్	95,306	9,884	50,293
నర్సంపేట	1,00,339	24,220	45,228
ములుగు	86,825	19,029	33,592
ఇల్లెందు	92,957	12,494	33,658
పినపాక	77,430	15,170	28,111
భద్రాచలం	53,637	10,294	19,406

పేదలకు సేవచేసే సువర్ణావకాశం నాకు లభించింది

పేదలకు సేవచేసే అవకాశాన్ని మానుకోట ప్రజలు నాకు ఇచ్చారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలను తప్పనిసరిగా అమలు చేస్తాం. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడతా. ప్రధానంగా ఈ నియోజకవర్గ పరిధిలోని బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, భద్రాచలం ఆలయ అభివృద్ధి జరిగేలా కృషి చేస్తా. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మోడల్ స్కూల్స్, పలు కళాశాలలు తెచ్చినం. మళ్లీ వాటిని అప్‌గ్రేడ్ చేయిస్తా. అనేక ప్రాంతాల్లో హైలెవల్ వంతెనలు లేక పేద ప్రజలకు ఇబ్బంది అవుతోంది. వాటి పైన ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధి చేస్తా. మానుకోట పార్లమెంట్ పరిధి ఎక్కువగా గిరిజన ప్రాంతం. ఈ ప్రాంత అభివృద్ధికి ఎల్లవేళలా ప్రజల వెంట ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తా. మానుకోట, కేసముద్రం, పలు స్టేషన్లలో రైళ్లు హాల్టింగ్ చేసేలా చూస్తా. ఇంత మెజార్టీతో గెలిపించిన ఈ ప్రాంత ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు. నా గెలుపునకు సహకరించిన పార్టీ శ్రేణులకు అండగా ఉంటా. – మహబూబాబాద్ ఎంపీ, పోరిక బలరాంనాయక్

'నీట్'లో మెరిశారు

ర్యాంకులతో సత్తా చాటిన ఖమ్మం ప్రైవేటు కళాశాలల విద్యార్థులు

ఖమ్మం ఎడ్యుకేషన్, జూన్ 4: జిల్లా విద్యా కుసుమాలు విరబూశాయి. కష్టపడితే ఫలితం రాక తప్పదని నిరూపించాయి. నీట్‌లో జిల్లాకు లభించిన ర్యాంకులే ఇందుకు నిదర్శనాలుగా నిలిచాయి. వైద్య విద్యలో ప్రవేశం కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) జాతీయస్థాయిలో ఇటీవల నీట్ పరీక్షను నిర్వహించగా.. మంగళవారం ఫలితాలను విడుదల చేసింది. ఈ ఫలితాల్లో ఖమ్మం నగరానికి చెందిన పలు ప్రైవేటు కళాశాలల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించి జిల్లా ఖ్యాతిని రాష్ట్రస్థాయిలో ఇనుమడింపజేశారు.

శ్రీచైతన్య ప్రభంజనం..

శ్రీచైతన్య విద్యార్థులతో డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య

నీట్ ఫలితాల్లో ఖమ్మం శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు జాతీయస్థాయిలో ప్రభంజనం సృష్టించారని శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు కే.మణిదీప్ 650 మార్కులు, బీ.మధు 627 మార్కులు, నసీమ్-604, బీ.సాయి-601, సింధు-586, కార్తీకేయని-582, నితిష-574, మనోహర్-571 మార్కులతో రాణించినట్లు వివరించారు. టాప్ వైద్య కళాశాలల్లో అత్యధిక మెడికల్ సీట్లు పొందే ఫలితాలను తమ విద్యార్థులు సాధించారని అన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ సాయిగీతిక, డీజీఎం చేతన్‌మాధుర్, డీన్ వర్మ, ఏజీఎంలు చిట్టూరి బ్రహ్మం, ప్రకాష్, గోపాలకృష్ణ, ప్రిన్సిపాళ్లు అభినందించారు.

న్యూవిజన్‌కు అత్యుత్తమ ర్యాంకులు..

విద్యార్థులతో న్యూవిజన్ చైర్మన్ చుంచు గోపాలకృష్ణ ప్రసాద్

నీట్ 2024 ఫలితాల్లో న్యూవిజన్ కళాశాల విద్యార్థులు ఆలిండియా స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారని విద్యాసంస్థల అధినేత చుంచు గోపాలకృష్ణ ప్రసాద్ తెలిపారు. జాతీయస్థాయిలో నిహారిక-780, హర్షిత్-1086, గణేశ్-2315, జాగృతి పవార్-2339, పూజిత-4187, కార్తీక్-5408, సందీప్-6427, చైతన్యసాయి-6888, ప్రణతి-8679, స్నేహ-9530వ ర్యాంకులతో రాణించినట్లు వివరించారు. జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో జిల్లాలో ఏ కళాశాల కూడా సాధించని ర్యాంకులను తమ విద్యార్థులు సాధించి అగ్రగామిగా నిలిచారని అన్నారు. విద్యార్థులను, అధ్యాపకులను అకడమిక్ డైరెక్టర్ కార్తీక్, డైరెక్టర్ చుంచు గోపిచంద్, ప్రిన్సిపాల్ బ్రహ్మాచారి, శ్రీనివాసరావు అభినందించారు.

హార్వెస్ట్ విజయకేతనం..

ప్రతిభ కనబర్చిన హార్వెస్ట్ విద్యార్థులతో కరస్పాండెంట్ రవిమారుత్

నీట్ పరీక్షలో హార్వెస్ట్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని కళాశాల కరస్పాండెంట్ పోపూరి రవిమారుత్ తెలిపారు. కళాశాల నుంచి 30 మంది విద్యార్థులు హాజరుకాగా అత్యధిక మంది మంచి మార్కులతో ఉత్తమ ర్యాంకులు సాధించారని అనాత్నరు. జిష్ణ్ణుష్ కృష్ణప్రసాద్ 667 మార్కులు, శ్రీప్రియతమ్-633, పునీత్-609, నవదీప్-600, గోకుల్‌కిశోర్‌రెడ్డి-596, హేమసాయి-571, శారోన్‌పెర్సిస్-551, కుశల్‌తేజ-516 మార్కులు సాధించినట్లు వివరించారు. సాధారణ స్థాయి విద్యార్థులతో అసాధారణ ఫలితాలను సాధించామని అన్నారు. విద్యార్థులకు, అధ్యాపకులకు ప్రిన్సిపాల్ రామసహాయం పార్వతిరెడ్డి అభినందించారు.

700 మార్కులతో 'కృష్ణవేణి'అగ్రస్థానం..

భరత్‌తేజ (కృష్ణవేణి)

భరత్‌వంశీ (కృష్ణవేణి)

నీట్ ఫలితాల్లో కృష్ణవేణి కళాశాల విద్యార్థులు అగ్రస్థానంలో నిలిచారని కళాశాల అధినేత యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. కళాశాల విద్యార్థి ఎన్.భరత్ తేజ 720 మార్కులకు గాను 700 మార్కులతో జిల్లాలో అగ్రస్థానం సాధించినట్లు చెప్పారు. భరత్ వంశీ-560, లక్ష్మి-540, సాద్విక్-531, స్వాతి-527, దీపికా-492, గీతికా-471, ఇందు-464, కోమలి-430, సాయిప్రైనికా-406 మార్కులతో రాణించినట్లు వివరించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను డైరెక్టర్లు గొల్లపూడి జగదీశ్, మాచవరపు కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ గుర్రం రాంచంద్రయ్య, అకాడమిక్ ఇన్‌చార్జి ఏలూరి వంశీకృష్ణ, ఏవో నిరంజన్ అభినందించారు.

రెజొనెన్స్ ప్రతిభ

రెజొనెన్స్ విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్లు నాగేంద్రకుమార్, శ్రీధర్‌రావు

నీట్ ఫలితాల్లో రెజొనెన్స్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని, మంచి ర్యాంకులు సాధించారని కళాశాల డైరెక్టర్లు రాజా వాసిరెడ్డి నాగేంద్రకుమార్, కొండా శ్రీధర్‌రావు తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు చంద్రికాలక్ష్మి-559, జోషిక-521, మమత-518, సాయిదర్శన-483, తనుశ్-468, తను-463, జాహ్నవి-452 మార్కులు సాధించినట్లు వివరించారు. ఇంటర్‌తోపాటు నీట్, ఎప్‌సెట్ వంటి పోటీ పరీక్షల్లో తమ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధిస్తున్నారని అన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాళ్లు సతీశ్, భాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

డాక్టర్స్ మెడికల్ అకాడమీకి మంచి ర్యాంకులు..

ర్యాంకులు సాధించిన విద్యార్థులతో డాక్టర్స్ మెడికల్ అకాడమీ బాధ్యులు రాయల సతీశ్, ఈగా భరణి

నీట్ ఫలితాల్లో డాక్టర్స్ మెడికల్ అకాడమీ విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించినట్లు అకాడమీ చైర్మన్ రాయల సతీశ్‌బాబు, డైరెక్టర్ ఈగా భరణికుమార్ తెలిపారు. తమ విద్యార్థుల్లో 216 మంది 400కిపైగా మార్కులు సాధించారని అన్నారు. వారిలో హారిక- 644 మార్కులు, పావనిశివాని-631, భగీరథ్-594, తేజస్విని-590, యజ్ఞ-587, పూజిత-585, రేఖ-578, విష్ణు-577, సాయిలక్ష్మి-568, ప్రత్యుష-568, జువ్వాద్-566, యాజ్-564, సాహితి-561, రిషితారాథోడ్-561, శ్రీవిద్య-560, ఝాన్సీ-557, వశిష్టమహర్షి-556, వాసిమ్-556, సౌమ్యశ్రీ-555, శ్రీజ-553, శివాని-544 మార్కులతో రాణించినట్లు వివరించారు. విద్యార్థులను అకాడమీ బాధ్యులు అభినందించారు.